4 నమస్తే తెలంగాణ
కరీంనగర్
సోమవారం 17 ఫిబ్రవరి 2025
www.ntnews.com

నేడు కేసీఆర్ బర్త్‌డే

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి.
మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

తెలంగాణ ప్రదాత.. స్వరాష్ట్ర విధాత

నూర శ్రీనివాస్
91827 77011

కేసీఆర్.. మూడు అక్షరాలు. తెలంగాణ గడ్డ ఉన్నంతకాలం తరం నుంచి తరానికి పారాడే పేరు కేసీఆర్. తెలంగాణ ఆత్మగౌరవాన్ని సమున్నత శిఖరంగా ఎగరేసిన మహానేత కేసీఆర్. రెండున్నర దశాబ్దాలుగా ఆయన పేరు తలచుకోకుండా తెలంగాణ బిడ్డలు, ఆయన నామస్మరణ చేయకుండా ప్రత్యర్థులు ఒక్కరోజు వెల్లదీయలేకుండా ఉండలేని అనివార్యతను సృష్టించారంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి రాష్ట్రంలో ద్వితీయశ్రేణి ప్రాంతంగా ఉన్న తెలంగాణను... ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉన్న తెలంగాణ ప్రజలను... అసలే శ్రేణో తెలియకుండా ఉన్న రాజకీయ నాయకులను 'ఇదిరా తెలంగాణ' అని గల్లా ఎగురవేసి నిలిపిన ధీశాలి ముమ్మాటికీ కేసీఆరే. ఇది ఆయన ప్రత్యర్థులు సైతం కాదనలేని సత్యం.

తెలంగాణలోని సబ్బండ వర్గాల ఆత్మగౌరవమే తన ఆత్మగౌరవంగా నిలిపిన మార్గదర్శి. కాటగలిసిన తెలంగాణను 14 ఏండ్ల సుదీర్ఘకాలం ఉద్యమించి 'రాష్ట్రం'గా ఆవిర్భవించేలా అవిరళ కృషిచేసిన పోరాటయోధుడిగా నిలిచి.. సాధించిన తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దిన దార్శనిక పాలకుడిగా చరిత్ర సృష్టించి మహానేతగా నిలిచారు కేసీఆర్.

ఆరున్నర దశాబ్దాలపాటు ఆశలన్నీ అడుగంటిపోయి నిశ్శబ్ద నిశీధిలో కాలం వెళ్లదీస్తున్న తెలంగాణకు కేసీఆర్ వెలుగుదివ్వెగా మారారు. 2001 ఏప్రిల్ 27వ తేదీన తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఒక రాజకీయ పార్టీని స్థాపించి జాతిపిత మహాత్మాగాంధీ అనుసరించిన అహింసా సిద్ధాంతంతో బయలుదేరారు. తెలంగాణ కోసం మహామహులే ఏమీచేయలేక చతికిలపడితే 'గీ బక్కపలచని మనిషి ఉపప్రాంతీయ పార్టీని స్థాపిస్తే ఆయన వెనుక ఎవరు నడుస్తారు?' అని ఈసడించుకున్న కాలాన్ని తన కార్యదీక్షాదక్షతలతో నమ్మికను కుదిర్చి తన వెంట నడవకుండా ఉండలేని అనివార్యతను సృష్టించారు. తెలంగాణలో పుట్టిన ప్రతీబిడ్డా తెలంగాణ కోసం గళమెత్తి 'జై తెలంగాణ' అని దిక్కులు పిక్కటిల్లేలా నినదించేలా చేశారు. తెలంగాణ అంతటా పక్షిలాగా తిరిగారు. ప్రజలను జాగృతం చేశారు. ప్రతీ రాజకీయ పార్టీ తలుపు తట్టారు. ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ దాకా, ప్రాంతీయ పార్టీల నుంచి జాతీయ పార్టీల దాకా ప్రతిఒక్కరూ తెలంగాణకు అనుకూలంగా విధాన నిర్ణయం తీసుకునేలా చేసిన వ్యూహకర్త కేసీఆర్. ఎన్నికల్లో పొత్తులైనా... ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలైనా.. రాష్ట్ర సాధనలో అస్త్రంగా మలిచిన పదునైన వ్యూహచతురత కేసీఆర్‌దే. 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటంలో ప్రతీ మనిషిని తెలంగాణ ఆయుధంగా తీర్చిదిద్దారు. తుదకు దగాపడ్డ తెలంగాణను దరికి చేర్చారు.

'దూరం నుంచి చూసినవారే కాదు.. కొన్ని సందర్భాల్లో దగ్గరి నుంచి మా లాంటివాళ్లమూ కేసీఆర్‌ను ముక్కుసూటి నాయకుడు, ముక్కోపి నేత అనుకుంటాం. కానీ, వారి మనసు వెన్న. సాయం చేయటంలో ఎముకలేని చేయి' అని మొదటి నుంచి కేసీఆర్‌ను చూసినవాళ్లు చెప్తుంటారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో... రాష్ట్ర సాధన అనంతరం అనేక సందర్భాల్లో కేసీఆర్ ఆ అభిప్రాయాన్ని అక్షరాలా ఆవిష్కరించారు. దేశంలో ప్రతిఒక్కరూ అనుసరించేలా మార్గం వేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాటి టీఆర్ఎస్ (నేడు బీఆర్ఎస్) పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ 'కూలీ' పని చేయాలనే నిర్ణయం తీసుకొని కదిలినప్పుడు.. పార్టీ అధినేతగా కేసీఆర్ కూలీ పనిచేశారు. అలా కూలీపని చేస్తున్న సమయంలో హన్మకొండలో ఒక జువెల్లరీ షాప్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఒక కుటుంబం తన కూతురు పెండ్లి కోసం నగలు కొనుగోలు చేస్తున్నారు. ఆ షాప్‌లో కేసీఆర్ కూలీ పనిచేస్తే వచ్చిన సొమ్ముతో సదరు పెండ్లి కూతురుకు బంగారు ఆభరణం (నెక్లెస్) కొనిచ్చారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో బిడ్డ పెండ్లి కోసం కొన్న నగలు, డబ్బులు అగ్నిప్రమాదానికి బుగ్గిపాలై ఓ తండ్రి (పెండ్లి కుమార్తె పేరు కల్పన) కన్నీరుమున్నీరుగా విలపిస్తుంటే విషయం తెలుసుకున్న కేసీఆర్ ఆర్థికసాయం అందించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత తొలి మంత్రివర్గంలో ఆడబిడ్డ పెండ్లికి కల్యాణలక్ష్మి అనే పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 'సైకిల్ కొనివ్వలేదని అల్లుడు బిడ్డను తోల్కపోతలేడు' అనే విషయం తెలుసుకొని తన డబ్బులతో సైకిల్ కొనిచ్చారు. పంటకోతల సమయంలో కూలీలు దొరకక రైతులు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న కేసీఆర్ ఊరు ఊరంతా వంతులవారీగా వరికోతలు చేసేలా ఆ సమయంలో తానూ కొడవలి పట్టుకొని పొలం కోసే సహజీవన పని సంస్కృతిని అమలు చేశారు. ఇలా తన రాజకీయ జీవితంలో... ఉద్యమ జీవితంలో ప్రజల బాధలను తన బాధలుగా స్వీకరించి వాటిని దూరం చేసేందుకు బాటలు వేసిన ఆత్మగల్ల సుట్టంగా కేసీఆర్‌ను ప్రజలు గుర్తిస్తారు.

తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం పదేండ్ల కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టి, విజయవంతంగా అమలు చేసిన సంక్షేమ పథకాలను దేశమే అనుసరించాల్సిన అనివార్యతలు ఏర్పడ్డాయి. తెలంగాణ ప్రజల పట్ల కేసీఆర్‌లో ఉన్న మానవీయ దర్శనానికి నిదర్శనం.. ఆసరా పింఛన్లు మొదలుకొని కంటివెలుగు దాకా, కేసీఆర్ కిట్ మొదలుకొని కేసీఆర్ న్యూట్రిషియన్ కిట్ దాకా, రైతుబంధు మొదలుకొని నీటితీరువా రద్దు దాకా, చేనేత, కల్లుగీత కార్మికుల బీమా మొదలుకొని రైతుబీమా దాకా, గొర్లపెంపకం మొదలుకొని చేపల పెంపకం దాకా.. ఇలా కేసీఆర్ అమలు చేసిన ప్రతీ పథకంలో ప్రజల సంక్షేమం ఉన్నది. ప్రతీ విధానంలో తెలంగాణ గతిని మార్చిన నినాదం ఉన్నది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రజలను కలవలేదనేది రాజకీయంగా చేసే విమర్శే తప్ప వాస్తవం కాదని ఆయన పదేండ్ల పాలనే నిదర్శమని తన ప్రత్యర్థి పార్టీల నేతలు సైతం పేర్కొన్న సందర్భాలు అనేకం ఉన్నాయి. పారిశుద్ధ్య కార్మికులతో, అంగన్‌వాడీ, ఆశావర్కర్లతో సహపంక్తి భోజనాలు చేసినా... 'సఫాయి అన్నా...! నీకు సలాం' అన్న మానవీయతను చాటిన సందర్భాలను ఆయా వర్గాలు గుర్తుచేసుకుంటాయి.

నాటి ప్రగతి భవన్‌లో జనహితహాల్‌ను నిర్మించారు. కేసీఆర్ జన్మదినోత్సవం నాడు ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. జనహిత హాల్ ప్రారంభోత్సవం సందర్భంగా 'మరణించిన జర్నలిస్టు కుటుంబ సభ్యులను ఆదుకునే కార్యక్రమం నిర్వహిద్దామని కేసీఆర్ అధికారులకు చెప్పారు. అయితే, మొదటి కార్యక్రమమే వారితో ఎందుకనే యోచనలో అధికారులు తర్జనభర్జన పడుతూ ఈ విషయాన్ని ఎలా చెప్పాలో తోచక వారు మౌనం దాలిస్తే.. వారి స్థితిని గమనించిన కేసీఆర్ 'ఆదుకోవటం, అండగా ఉంటాం అనే ధైర్యం ఇవ్వటం కన్నా పవిత్ర కార్యం ఏమి ఉంటుంది. అదే కార్యక్రమం చేద్దాం' అని అధికారులను ఆదేశించారు. కేసీఆర్ హయాంలో ఆయనను దగ్గరి నుంచి చూసిన వారు లెక్కలేనన్ని సంఘటనలను ఉదహరిస్తారు. మొత్తానికి కేసీఆర్ అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే కేసీఆర్. ఇది తెలంగాణ ఉన్నంతకాలం ఎవరు అంగీకరించినా.. అంగీకరించకపోయినా శిలాసదృశ్యంగా నిలిచి ఉంటుందనటంలో అతిశయోక్తి లేదు. ■

> నాకు కావలసింది తెలంగాణ రాష్ట్రం. మీరు ఏ మంత్రిత్వ శాఖ ఇస్తారనేది నాకు ప్రధానం కాదు. ఏదిచ్చినా సంతోషంగా స్వీకరిస్తా. కానీ, తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వండి'
>
> **- 2004లో యూపీఏ-1 సర్కారు కేంద్రమంత్రివర్గ కూర్పుపై మల్లగుల్లాలు పడుతుంటే నాటి కాంగ్రెస్ సీనియర్ నేత ప్రణబ్ ముఖర్జీతో కేసీఆర్**

> కేసీఆర్ ఉద్యమ నాయకుడు. ఆవేశపరుడే అనుకున్నాం. కానీ, కేసీఆర్‌లో విన్‌స్టన్ చర్చిల్‌కు (సంక్లిష్ట సమయంలో సంయమనంతో వ్యవహరించి గమ్యాన్ని చేరిన బ్రిటన్ మాజీ ప్రధాని) ఉన్నంత దార్శనికత ఉంది. తన లక్ష్యమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, దేశంలోనే అగ్రగామిగా తెలంగాణను నిలిపేందుకు కేసీఆర్ ప్రదర్శించిన చొరవ అనితర సాధ్యమైనది
>
> **- పాత్తూరి వెంకటేశ్వర్‌రావు**

> **కేసీఆర్ వ్యక్తిగా ఉదార స్వభావి. రాజకీయాల్లో మాత్రం అగ్రెసివ్. యుద్ధతంత్రంలో ఆయనొక సుంజూ. శత్రువు ఊహించని వ్యూహరచనతో హో చిమిన్‌లా విరుచుకు పడగలరు. అహింసా ఉద్యమకారుడిగా ఆయనలో ఒక గాంధీ, ఒక మార్టిన్ లూథర్‌కింగ్ దర్శనమిస్తారు. తమ దేశాన్ని ప్రేమించడంలో ఫిడెల్ కాస్ట్రో, ఆంగ్‌సాన్ సూకీలను గుర్తుకుతెస్తారు.**
>
> **- తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్**

చీకటి తెలంగాణకు వెండి వెన్నెల

జూలూరు గౌరీశంకర్

తెలంగాణ వస్తదని, తెలంగాణలో స్వయం పాలనను కూడా చూస్తామని ఊహకందని విషయాన్ని ఆచరణ మార్గం పట్టించి, దేశాన్నే ఏకం చేసి, అందరి చేత తెలంగాణకు జై కొట్టించిన అస్తిత్వ, ఉద్యమ పతాక కేసీఆర్. స్వరాష్ట్ర సాధన కోసం ఎందరెందరో తపించారు. కానీ, ఎవరికీ సాధ్యం కాని అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు కేసీఆర్.

సత్యం చెప్పాలె, నిజం మాట్లాడాలె.. ఉమ్మడి పాలనలో వెన్నెల చూడలేని పల్లెలుగా తెలంగాణ మారింది. నిర్బంధాలతో నిప్పుల కుంపటైంది. ఆగ్రహించిన యువత ఆర్ట్స్ కాలేజీ మెట్లమీంచి, కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి, రాచకొండల గుట్టల నుంచి నాడు గొంతెత్తి అరిచింది. ఎక్కడ, ఏ బిడ్డ తెల్లారేకల్లా నెత్తురు ముద్దయి దిన పత్రికలకు నెత్తుటి సింధూరం అవుతాడో, ఏ తల్లి ఉలిక్కిపడి కలత నిద్రలో కన్నీటి నది అవుతుందో తెలియని పరిస్థితి. 'గాంధీ పుట్టిన దేశమా ఇది? నెహ్రూ కోరిన సంఘమా, రామరాజ్యం, సామ్యవాదం సంభవించే కాలమా ఇది?' అని కవులు రాసిన పాటలకు తెలంగాణ ఉద్రిక్తతకు గురైంది. 'సాపాటు ఎటూ లేదు పాటైనా పాడు బ్రదర్.. రాజధాని నగరంలో వీధి వీధి నీదీ నాదే బ్రదరూ..' అన్న పాట నాటి నిరుద్యోగ భారతానికి నిదర్శనంగా నిలిచింది.

తెలంగాణలో కన్నీరు పెట్టని పల్లె లేదు. భూమి, భుక్తి, విముక్తి పోరాటాలు ఎగిసాయి. ఊరు మారాలే, ఊర్లో పెత్తందారీతనాలు మారాలే.. భూములు ఇంకో రూపంలో చెరబడ్డాయి. భూమి లేదు, భుక్తి లేదు, విముక్తి లేదు.. నాలుగు వేల నల్లదేహాలు మాత్రం నేలకొరిగాయి. ఎక్కడ, ఏ వసంత మేఘగర్జన విన్నా తెలంగాణ పిడికిలెత్తింది, నెత్తురిచ్చింది. తెలంగాణలో స్థూపాలు లేని ఊళ్లు లేవు. దూపతీరిన గ్రామం లేదు. పాలమూరు బొంబాయి బస్సెక్కింది. కరీంనగర్ చౌటుప్పల్, నిజామాబాద్‌లు రెక్కలు కట్టుకొని వలస పక్షులై దుబాయికి పాయే!! గోదావరి పరీవాహక ప్రాంతమంతా గొంతెండిపోయింది. నాగేటిసాళ్లు నల్లరేగడిలు రైతు బిడ్డ బోర్ల రాంరెడ్డి ఆవేదనలుగా మారింది నిజం కాదా!! ఫ్లోరోసిస్ భూతంతో పళ్లు పాచిపోయి, ఒళ్లంతా కుంగిపోయి తెలంగాణ మంచం పట్టింది వాస్తవం కాదా? తెలంగాణది ఒక గోస కాదు, ఒక తీరు కాదు. నెర్రెలు బారిన నేలలకు, గొంతెండిపోతున్నా ఇక్కడ నీళ్లియ్యలేకపోయిన దుర్మార్గపు దుస్థితికి కారణమెవ్వరో? గుండెలు పగిలి రోధిస్తుంటే జనం వెన్నుమీద వేసిన కనకపు సింహాసనాలపై కూర్చున్నవాళ్లు ఏమీ చేయకపోవడంతో.. జనం నిస్సత్తువతో కూలబడ్డ దృశ్యాలన్నీ కాలం కెమెరాలో నిక్షిప్తంగానే ఉన్నాయి.

లోకానికి చెప్పేవాళ్లు కాదు, చేసి చూపించి వ్యవస్థను మార్చేవాళ్లు కావాలి. సరిగ్గా ఈ సందిగ్ధ కాలంలోనే బక్క చిక్కిన తెలంగాణ కోసం ఒక బక్క మనిషి వచ్చి పిడికిలి బిగించిండు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం గొంతు విప్పిండు. బొంబాయి, దుబాయి, బొగ్గుబాయిలకు పోయే తెలంగాణ జీవన చిత్రపటం మారాలన్నడు. స్వరాష్ట్ర సాధనొక్కటే మార్గమని రాజకీయ ఉద్యమ ప్రక్రియను చేపట్టిండు. 'కేసీఆర్ సచ్చుడో, తెలంగాణ వచ్చుడో'నని పంతం పట్టి నిలిచిండు. అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించే ఉద్యమ రూపం రచించి, వాటిని ఆచరణాత్మకంగా చేసి చూపించి, పోరాడిన స్వరాష్ట్ర సాధకుడిని ఈ నేల ఎప్పటికీ మరవదు. ఆయన చీకటి తెలంగాణకు వెండి వెన్నెల. బీళ్లకు నీళ్లు మళ్లించిన కాళేశ్వర మహాసాగరం.

> **'తెలంగాణ తెస్తామని చెప్పి వెన్నుచూపి పోయినోళ్లనెందరినో చూసినా.. ఇతగాడు తెలంగాణ తెచ్చి తీరుతాడన్న నమ్మక ముంది' అని కాళోజీ నుంచి ఆశీర్వాదం తీసుకున్న కేసీఆర్ ఆచరణాత్మకంగా తెలంగాణ తెచ్చిండు. 'ఎవరు, ఎన్ని విశ్లేషణలు చేసినా తెలంగాణ కోసం పంతం పట్టి, పట్టిన పట్టును విడవకుండా నిలిచి, కార్యసాధకుడై గెలిచి తెలంగాణను నిలుపుతాడు' అన్న తెలంగాణ సిద్ధాంతకర్త, కాలజ్ఞాని కొత్తపల్లి జయశంకర్ చెప్పిన మాటను నిజం చేసిన కార్యసాధకుడు కేసీఆర్.**

స్వరాష్ట్రాన్ని సాధించి తిరిగి ఆయనే పునర్నిర్మాణధారిగా మారి నదులకు నడక నేర్పి బీడు భూములకు, నీళ్లొక్కవన్న ఎగువ భూములకు మళ్లించిండు. నీళ్లు, నిధులు, నియామకాలకు ఆచరణ రూపమిచ్చిండు. వలసలను ఆపిండు. చెప్పిన దానికంటే ఎక్కువ చేసి చూపిండు. దేశంలో ఎక్కడా లేని విధంగా బడుగుల గురుకులాలను పెంచిండు. రైతుల ఆత్మబంధువు అయ్యిండు. కన్నీరు పెట్టిన తెలంగాణను సుభిక్షంవైపు నడిపిండు. మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ పథకం ద్వారా బీసీ బిడ్డలు దేశ విదేశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. దళితబంధు విప్లవాత్మక చర్య. గురుకులాలు రేపటి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల బిడ్డల చదువులకు మెట్లు. గురుకులాల నుంచి రాబోయే ఆ బడుగుల బిడ్డలే రేపటి తెలంగాణలోని అన్నిరంగాల్లోకి ప్రవేశించి అంచెలంచెలుగా ఎదుగుతారు. బహుజన స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వంతో జోడించి తెలంగాణలోని గంగాజమున తెహజీబ్ సంస్కృతిని నిలబెట్టిన దార్శనికుడు కేసీఆర్. తెలంగాణ పునర్నిర్మాణానికి పునాది.. భవిష్యత్తు తెలంగాణకు ఊపిరి పోసిండు. ప్రజల కోసం పనిచేయడం కంటే మించినది మరొకటి లేదు. నారు పోసినోడే నీరు పోస్తాడని చిన్నప్పుడు చదువుకున్నా. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి నారు పోసి స్వరాష్ట్రాన్ని సాధించి, నీళ్లు పోసిన కేసీఆర్‌ను తెలంగాణ సమాజం చూసింది. మనందరం ఉద్యమంలో పాల్గొని స్వరాష్ట్రాన్ని సాధించుకుని విజేతలమయ్యాం. ఓడి గెలిచిన తెలంగాణకు మనమే నిషాని. కేసీఆర్ పుట్టినరోజు ఫిబ్రవరి 17 కాదు, 2014 జూన్ 2 అని చెప్పడంలో ఎలాంటి సంశయం అక్కర్లేదు. వందేండ్ల ముందుచూపున్న దార్శనిక నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు. ■

వ్యూహకర్త స్థితప్రజ్ఞత

గోసుల శ్రీనివాస్ యాదవ్

ప్రళయాన్ని సృష్టించిన ఉద్యమ నేత కేసీఆర్ రాష్ట్రాన్ని తీసుకొచ్చిన ప్రతీ సన్నివేశాన్ని, సంఘటననూ దగ్గరగా వీక్షించిన మనం.. ఇప్పుడు సార్ మౌనాన్ని తదేకంగా చూడాల్సి వస్తున్నది. సార్ మౌనం వెనుక వ్యూహం ఉంటుందని అందరికీ తెలుసు. మౌనం ఉద్దేశపూర్వకంగా నొక్కి చెప్పే తపస్సు. మౌనంగా ఉండటమే ఉత్తమమని చాలా సందర్భాల్లో చాలామంది చెప్తుంటారు. భావోద్వేగాలను అణచిపెట్టడం, తగాదాలను తప్పించడం, పరిస్థితులను చక్కబరిచేందుకు మనసుకు విశ్రాంతి అవసరం. పరిపక్వత గల రాజకీయాల్లో అటు వ్యూహాత్మక ఉద్వేగం, ఇటు ఆలోచనాత్మక మౌన వ్యూహాన్ని పాటించడం చాలా అరుదు. సమకాలీన భారతదేశ రాజకీయాల్లో అలాంటి వారు ఇప్పుడెవ్వరూ లేరు, ఒక్క కేసీఆర్ మినహా.

సమయం, సందర్భంతో దేశ రాజకీయాలను ఒక్కటి చేసిన కేసీఆర్ నాడు ఉద్యమాన్ని నిర్మించి రాష్ట్రాన్ని సాధించినా.. నేడు ఆ రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా తయారవుతున్న ఆందోళన, ఆవేదన ఉన్నా వ్యూహాత్మక మౌన వైఖరిని అనుసరిస్తుండటం రాజకీయాల్లో పెను సంచలనాలు సృష్టిస్తున్నది. ఈ రెండింటిని సమానంగా, ధైర్యంగా ఎదుర్కోగల ఏకైక నేత కేసీఆర్. ఏడు పదుల వయసు దాటిన పెద్దాయన ఆదర్శప్రాయ రాజకీయ జీవితం గురించి ఎంత చెప్పినా, ఎన్ని పుటలు రాసినా తక్కువే. ఈ సమయంలోనే కేసీఆర్ స్థిత ప్రజ్ఞత చర్చకు వస్తున్నది. మానవాళి కోసం గరళాన్ని మింగిన శివుడిలా.. ప్రజల కోసం అవమానాలను భరిస్తూ తెలంగాణ పరిరక్షణకు, కాంగ్రెస్ పాలకుల నుంచి విముక్తి పొందేందుకు మౌనాన్ని ఓ యజ్ఞంలా వ్యూహాత్మకంగా చేపడుతున్నారని గ్రహించాలి.

> ప్రముఖ కవి శ్రీరత్నాకరం బాలరాజు తన 'ధమ్మపదం' పుస్తకంలో ఇలా చెప్పారు...
>
> **'చంద్రుణ్ణీ, హాలాహల విషాన్నీ,**
> **ఈశ్వరుడు గ్రహించినట్లు**
> **పండితుడు అందరి గుణాలనూ శిరసా శ్లాఘించి**
> **దోషాలను మటుకు కంఠమందే నిల్పుకుంటాడు..**
> **బహిర్గత మొనరింపడు' అని**
> **'గరళకంఠులు' కానిదెవ్వరూ**
> **ఎప్పటికీ ఆధ్యాత్మిక విజ్ఞానులుగా విరాజిల్లజాలరు**

పొక్కిలవుతున్న నేలలు, నెర్రెలు బారిన పొలాలు, పల్లెల్లో ఎన్‌కౌంటర్ల రక్తపాతం, బతుకుదెరువు కోసం వలస వెరసి జీవన వ్యవస్థే ఛిద్రమైన నాటి దుస్థితిపై పోరాటం చేసి, రాష్ట్రమొస్తే అన్నింటికి పరిష్కారమని దిశ చూపిన ధీశాలి కేసీఆర్. కాల ప్రవాహంలో ఎదురొచ్చే మంచీచెడులను, కష్టసుఖాలను సమానంగా స్వీకరించే స్థితప్రజ్ఞతతో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో అగ్రభాగాన నిలిపిన దార్శనికుడు. ఆరున్నర దశాబ్దాల పోరాటం, మూడున్నర కోట్ల ప్రజల ఆకాంక్షలు, వేల బలిదానాలు, త్యాగాలు, బిగిసిన సబ్బండ వర్గాల పిడికిళ్లు, ఉద్యమ సేనాని అకుంఠిత, ఆమరణ దీక్ష ఫలితంగా ఉద్యమం విజయతీరాలకు చేరి స్వరాష్ట్రం సాక్షాత్కారమైంది. ఉద్యమ నాయకుడే ప్రజాపాలకుడిగా స్వతంత్ర భారతదేశం ముందెన్నడూ చూడని సమగ్ర, సమీకృత, సమ్మిళిత, సమతుల్య అభివృద్ధి నమూనా ఆవిష్కృతమైంది. ఆయన హయాంలోనే పల్లె, పట్నం తేడా లేకుండా ప్రగతిరథం పరుగులు తీసింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి నుంచి ఐటీ ఎగుమతుల వరకు రికార్డులు బద్దలయ్యాయి. సకల జనుల సంక్షేమానికి తెలంగాణను చిరునామా చేశారు. గుండెలనిండా 'జై తెలంగాణ' నినాదంతో మన భాషకు పట్టం గట్టారు. మన బతుకమ్మ, మన బోనాన్ని సగర్వంగా తలకెత్తుకునేలా చేశారు. అవమానాలు, అవహేళనలు ఎదుర్కొన్న గడ్డ మీదనే తెలంగాణ ఆత్మగౌరవ పతాకాన్ని అంబరాన్నంటేలా ఎత్తుకున్నారు.

> 'యస్య కృతం న జానంతి
> మంత్రం వా మాత్రితం పరే
> కృతమేవాస్య జానంతి సవై
> పండిత ఉచ్యతే!'

నాయకుడు లక్ష్య సాధనకు తనదైన మార్గాన్ని ఎంచుకుంటాడు. తనవైన వ్యూహాల్ని అమలు చేస్తాడు. తను సమీకరించుకున్న బలగాన్ని మోహరిస్తాడు. అంతిమంగా అనుకున్నది సాధిస్తాడు. ఇదే విషయాన్ని ఇంగ్లిష్‌లో.. మిషన్, విజన్, వాల్యూస్, విక్టరీగా సంక్షిప్తం చేయవచ్చు. తెలంగాణ ఉద్యమ జెండాను భుజానికి ఎత్తుకునే సమయానికి.. కేసీఆర్ ఒక ఒంటరి అంకె. అయితేనేం, తనకంటూ ఓ మిషన్ ఉంది. స్పష్టమైన విజన్ ఉంది. అందుకే ఓ ప్రజా నాయకా.. నిండు నూరేండ్లు వర్ధిల్లు.. విజయీభవ.. పునర్వైభవ.. అధికార ప్రాప్తిరస్తు..

(వ్యాసకర్త: చైర్మన్, తెలంగాణ నాలెడ్జ్ సెంటర్ ఫర్ రీసెర్చ్ (టీ కేసీఆర్ సెంటర్)

అభినవ రూపశిల్పి

అతడు
స్వప్నించడమే కాదు
విజయానంద స్వప్న సౌధాల
అభినవ రూపశిల్పి

తడారిన తెలంగాణ తల్లిని
స్ఫటిక జలాలతో అభిషేకించిన
అపర భగీరథుడు

కరెంట్ స్తంభాలకు వేలాడుతున్న
అన్నదాతల బతుకు
బట్టలు కరెంట్ తీగల మీద
తగలబడి పోతుంటే
కరెంట్‌ను పర్మనెంట్ వరంగా మార్చి
ఆరిపోని ఆశాదీపాలను వెలిగించిన
ఆత్మజ్యోతి
కరెంటు ట్రాన్స్‌ఫార్మర్

మందుగోళీలకే కాదు
ముది వయసు జిహ్వాచాపల్యాన్ని తీర్చే
తెలంగాణ అవ్వ ఆకుల సంచి

జననం నుంచి పునర్జన్మ వరకు
చెయ్యి పట్టి నడిపిన మేనమామల
కల్యాణలక్ష్మి కిట్టు

నెర్రెలు వారిన నేలలో చలిచెలిమ
శిశిరమైన జీవితాలకు నవవసంతం
వెలసిపోయిన వార్ధక్యపు మేడల్లో
కొత్త కాంతులు నింపిన
తెలంగాణ సింగిడి
అయోమయపు అన్నదాతల జీవితాలకు
భీమానిచ్చిన రైతుబీమా
వర్గాంతరాలకు సవాలుగా నిలిచిన
దళిత బంధు
తెలంగాణ భవిష్యద్దర్శనం చేసుకున్న ద్రష్ట
ఎవ్వరికీ, ఎప్పుడూ తలవంచని
తెలంగాణ ఆత్మగౌరవం

అతడే
సమస్త తెలంగాణ జనుల
హృదయ స్పందన

తుల్జారాం సింగ్ ఠాకూర్
78930 05313

సంకల్ప దీప్తి.. తెలంగాణ ఘనకీర్తి

కడలిలా కమ్ముకొచ్చే కష్టాల కెరటాల్లోనే లక్ష్యాన్ని ఎలా సాధించాలో ఆయనకే తెలుసు. ఆశల రుతువులో నమ్మకాల మబ్బులను చూసుకొని బతుకును చిగురింపజేసుకొనే నిరంతర వసంతకాల అన్వేషి ఆయన.. తెలంగాణ మట్టే ఆయన జీవితం. దీన్ని మాగాణం చేయడమే ఆయన ధ్యేయం. ఈ భూమిలో ఆయన విత్తు అయ్యారు.. మొక్క అయ్యారు.. చెట్టు అయ్యారు.. మహా వృక్షమై ఎదిగి వచ్చారు. నెర్రెలు వారిన నేల గొంతులు తడిపారు. పల్లమెరిగిన గోదావరి అడుగు మరల్చి తన భూమితల్లిని మాగాణం చేశారు.

స్వరాష్ట్రంలో జలసిరులతో.. భూమితల్లి పచ్చని పట్టుచీర కట్టుకొని గజ్జె కట్టి ఆడిన సవ్వడులు విని ఏనాడో అన్నింటినీ వదిలి వెళ్లిన అన్నదాతలు.. తమ మట్టి కోసం మళ్లీ దండుకట్టి తిరిగి వచ్చారు. వారి అడుగులకు కేసీఆర్ ముందడుగై నడిచారు. బంగారు తెలంగాణ వైపు ప్రస్థానం సాగించారు. ఆరు దశాబ్దాల తెలంగాణ దాస్యాన్ని విముక్తం చేశారు. బీడు భూమి ఎండిన కాలం మీద సగర్వంగా ఎగిరిన జెండా అతడు. కాళేశ్వరం ప్రాజెక్టు శిఖరం పైనుంచి 'నేనురా తెలంగాణ నిగళాలు తెగద్రొబ్బి ఆకాశమంత ఎత్తార్చినాను' అని ఎలుగెత్తి నినదించిన వీరుడు.. కల్వకుంట్ల చంద్రశేఖరరావు. ఏడు వసంతాల నిండు జీవితంతో సప్తతి మహోత్సవాన్ని జరుపుకొంటున్న నాయకుడు కేసీఆర్. శత్రువుకు కూడా శుభం కలుగాలని కోరుకోగల స్థితప్రజ్ఞత కలిగిన నాయకుడు కేసీఆర్. ఆయన నడక, నడవడిక ఒక స్ఫూర్తి. ఆయన కార్యదక్షత ఒక మార్గదర్శకత్వం. నేటి దేశ రాజకీయాల్లో కేసీఆర్ వంటి నేత లేరనడంలో సందేహం లేదు.

ఆశలు కోల్పోయి, అన్ని రకాలా ఆగమైపోయి, అనేక ఇబ్బందుల పాలై, వలసలు, రైతుల ఆత్మహత్యలతో తెలంగాణ పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ నేపథ్యంలో గుండె దిటవు చేసుకొని, గుప్పెడు మందిని వెంటపెట్టుకొని కాలికి బలపం కట్టుకొని అడుగు ముందుకు వేసిన నేత కేసీఆర్. తెలంగాణ అంతటా పక్షిలాగా తిరిగారు. ప్రజలను జాగృతం చేశారు. ప్రతీ రాజకీయ పార్టీ తలుపు తట్టారు. తెలంగాణ